
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 29 ఆగస్టు 2024



అమ్మ భాష... మమతల మూట 8లో..
- నేడు మాతృభాషా దినోత్సవం

7లో.. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి: మంత్రి



క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ అధికారులు

సాగు లెక్క తేలింది..

- స్వల్పంగా తగ్గిన లక్ష్యం
- అంచనా 2.42 లక్షల ఎకరాలు
- సాగైన పంటలు 2.28 లక్షల ఎకరాలు
- క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారుల క్రాప్ బుకింగ్
- ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఫొటోలతో సహా వివరాల అప్‌లోడ్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వానాకాలం పంటల సాగు ఆరంభ దశలోనే నైరుతి పవనాలు ముఖం చాటేయడంతో వరినాట్లపై ప్రభావం పడింది. పత్తి విత్తనాలు వేసుకున్న రైతులు ఆందోళనలో పడ్డారు. వర్షాలు ఆశాజనకంగా ఉంటాయని భావించినా రైతులు గత యాసంగి సీజన్ దృష్టిలో పెట్టుకోని సాగుకు సిద్ధమయ్యారు. వ్యవసాయ శాఖ వేసిన అంచనాకు స్వల్పంగా సాగు లక్ష్యం తగ్గింది. పంటల లెక్క పక్కాగా ఉండేందుకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో క్రాప్ బుకింగ్ నిర్వహించారు. ప్రత్యేక వెబ్‌సైట్‌లో సర్వే నంబర్ల ప్రకారం జియో ట్యాగింగ్, ఫొటోలతో సహా అప్‌లోడ్ చేశారు. దీని ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొంత మేరకు వరి, పత్తి సాగు తగ్గింది.

● వరివైపే రైతుల మొగ్గు...

వానాకాలం సాగులో రైతులు వరి వైపే మొగ్గుచూపారు. గతంలో ప్రధానంగా పత్తివైపు ఉన్న రైతులు మూడు సీజన్‌లుగా కాళేశ్వరం ఎత్తిపోతలు, మిడ్ మానేరు ప్రాజెక్ట్, అనంతారం ప్రాజెక్ట్‌తో పాటు జిల్లాలోని చెరువులు ఎండాకాలంలోనూ నింపిన సందర్భాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ఇదే క్రమంలో గత ప్రభుత్వ హయాం నుంచి 24 గంటల ఉచిత విద్యుత్ అమలు చేయడంతో రైతులు బోరుబావులను అధారంగా వరివైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో లక్ష 77 వేల 762 ఎకరాల్లో వరి సాగు చేసుకున్నారు.

● 2.28 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల డివిజన్ల పరిధిలో వ్యవసాయ శాఖ పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేసింది. వానా కాలం సీజన్‌లో 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో 2.28 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 1.83 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉండగా 1.77 లక్షల ఎకరాల్లో నాట్లు వేసుకున్నారు. పత్తి 49,215 ఎకరాల లక్ష్యంగా ఉండగా 47,982 ఎకరాల్లో సాగు చేశారు. దీంతో పాటు మొక్కజొన్న 1,204 ఎకరాలు, పెసర 57.15 ఎకరాలు, కందులు 934 ఎకరాలు, ఇతర పంటలు 148.34 ఎకరాల్లో సాగు చేశారు.

జిల్లాలో వానాకాలం సాగు పరిస్థితి (ఎకరాల్లో)

మండలం	సాగు అంచనా	ప్రస్తుత సాగు
గంభీరావుపేట	19,535	18,436.93
ఇల్లంతకుంట	39,987	37,209.33
ముస్తాబాద్	24,239	23,039.83
సిరిసిల్ల	5,417	5,252.58
తంగళ్లపల్లి	22,270	19,100.23
వీర్నపల్లి	8,095	7,314.13
ఎల్లారెడ్డిపేట	23,093	20,781.72
బోయినపల్లి	21,150	20,043.84
చందుర్తి	22,016	21,319.95
కోనరావుపేట	24,295	21,038.47
రుద్రంగి	10,857	9,321.53
వేములవాడ	7,820	10,265.91
వేములవాడ రూరల్	14,340	14,950.75
మొత్తం	2,42,766	2,28,075.22

● తగ్గుతున్న పత్తి సాగు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పత్తి సాగు వైపే రైతులు మొగ్గు చూపుతూ వచ్చినా గత రెండు సీజన్లుగా పత్తి సాగు తగ్గిపోతుంది. గతంలో 80 వేల నుంచి లక్ష ఎకరాల వరకు పత్తి సాగు చేసేవారు. ఈ సారి 49,215 ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసిన 47,982 ఎకరాల్లోనే సాగు చేశారు. తంగళ్లపల్లి మండలంలో పత్తిసాగు చేయ లేదు. అతి తక్కువగా గంభీరావు పేటలో 220 ఎకరాల్లో సాగు చేయగా బోయిన పల్లిలో 6,795 ఎకరాల్లో సాగు చేశారు. ఎక్కువ మంది రైతులు వరి, ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఆయిల్‌పామ్ సాగు కూడా పెరుగుతోంది. దీంతో పత్తి సాగు రాబోయే రోజుల్లో మరింత తగ్గుతుందని భావిస్తున్నారు.



జిల్లాలో వానాకాలం సాగైన పంటలు (ఎకరాల్లో)

మండలం	వరి	పత్తి
గంభీరావుపేట	18,200	220
ఇల్లంతకుంట	24,000	12,412
ముస్తాబాద్	22,000	760
సిరిసిల్ల	4,450	780
తంగళ్లపల్లి	19,010	00
వీర్నపల్లి	6,800	514
ఎల్లారెడ్డిపేట	16,900	3,850
బోయినపల్లి	13,000	6,795
చందుర్తి	15,500	5,800
కోనరావుపేట	16,352	4,601
రుద్రంగి	5,500	3,200
వేములవాడ	5,100	5,100
వేములవాడరూరల్	10,950	3,950
మొత్తం	1,77,762	47,982

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ

- డీఏవో అఫ్జల్‌బేగం



డీఏవోకు సమస్యలను వివరిస్తున్న నాయకులు, రైతులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 28: జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాంగ్రెస్ నాయకులు, రైతులు వివరించారు. ఈ సందర్భంగా డీఏవో అఫ్జల్‌బేగం మాట్లాడుతూ జిల్లాలో రుణమాఫీ వర్తించని రైతుల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. పొరపాట్లను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. రెండు లక్షల రూపాయల పైన రుణం ఉన్న రైతుల వివరాలను సేకరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించి సరిచేస్తామని తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డుల్లో పేర్లు లేకపోవడం వల్ల రుణమాఫీ వర్తించలేదని పేర్కొన్నారు. తప్పులను స రిచేసి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అన్నారు. ఏఈవో శ్రీశైలం, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందవద్దని మండల ఇన్చార్జి వ్యవసాయ అధికారి ఫజల్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రుణాలు తీసుకున్న 88 మంది రైతులకు రేషన్ కార్డులో పేరు సరిగా లేనందున రుణమాఫీ కాలేదని వివరించారు. రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా కోర్టు ఇన్‌చార్జి పీపీగా పెంట శ్రీనివాస్



సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: రాజన్న సిరిసిల్ల ప్రిన్సిపల్ సెషన్ కోర్టు, జిల్లా కోర్టు ఇన్‌చార్జి పీపీగా పెంట శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యా యి. ప్రస్తుతం పోక్సో కోర్టు పీపీగా ఉన్న శ్రీనివాస్‌కు జిల్లా కోర్టు పీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేర కు ఆయన బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాస్ నియామకంపై సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వీర్నపల్లి, ఆగస్టు 28: గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వీర్నపల్లి మండలం లాల్ సింగ్ తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన జగదంబా దేవి, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పాల్గొన్నారు. వేడుకలకు విచ్చేసిన ఆయనకు గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో గిరిజనులు సాంప్రదాయ పండుగలతో ఐక్యతను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్‌గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ గజన్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాములు నాయక్, రాకేష్ గౌడ్, రాజు నాయక్, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు హజు నాయక్, గజన్ లాల్, రాంరెడ్డి, రవిలాల్, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీర్నపల్లి, ఆగస్టు 28: అడవిపదిర సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ వృద్ధి ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అడవిపదిర, రంగంపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సెల్‌టవర్‌పై మందుబాబు హంగామా

- గంట పాటు ఉత్కంఠ

తంగళ్లపల్లి, ఆగస్టు 28: మద్యం మత్తులో సెల్‌టవర్ ఎక్కి హంగామ సృష్టించిన సంఘటన తంగళ్లపల్లి మండలం తాడురు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తాడూరు గ్రామానికి చెందిన కొమురవెల్లి శ్రీనివాస్ మద్యం మత్తులో జాతీయ జెండాను పట్టుకుని గ్రామ నడిబొడ్డున సెల్ టవర్ ఎక్కాడు. మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కిన శ్రీనివాస్ ఎక్కడ కిందపడిపోతాడోనని గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. సుమారు గంట పాటు ఉత్కంఠ నెలకొంది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు, గ్రామస్థులు బుజ్జగించిడంతో సెల్‌టవర్ దిగాడు. సెల్‌టవర్ ఎందుకు ఎక్కావని పోలీసులు ప్రశ్నిస్తే జెండా ఎగరవేయాడానికి అని... స్థలం విక్రయించనివ్వడం లేదంటూ.. పొంతనలేని సమాధానాలు చెప్పాడు.



సెల్‌టవర్‌పై మందుబాబు

శృంగేరి పీఠం అనుమతితో ఆలయ విస్తరణ

- తిరుమల తరహాలో రాజన్న సన్నిధిలో నిత్యాన్నదాన సత్రం
- భక్తులకు వేగంగా దర్శనం, మెరుగైన వసతులకు చర్యలు
- బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 28: శృంగేరి పీఠం అనుమతితో రాజన్న ఆలయాన్ని విస్తరిస్తామని బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి విచ్చేసిన మంత్రికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి స్వాగతం పలికారు. మంత్రికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజన్న క్షేత్రంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేవంలో మంత్రి పొన్నం మాట్లాడారు. తిరుమల తరహాలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. రానున్న కార్తీక మాసంలోగా భక్తులకు నిత్యాన్నదాన సత్రం అందుబాటులోకి తీసుకువచ్చి తీరుతామన్నారు. సత్రం ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలోనే అతిపెద్ద శైవక్షేత్రంగా వీరజిల్లుతున్న ఆలయానికి వచ్చే భక్తులు వేగంగా దర్శనం కల్పించేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాజన్న కోడెల సమస్యలను పరిష్కరించామని గుర్తు చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం, మంత్రులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు.

● రాజన్న ఆలయాభివృద్ధికి కృషి : విప్

రాజన్న ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకకృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ఏడాది శ్రావణ మాసం ఆరంభం నుంచి భక్తుల కోసం బ్రేక్‌దర్శనాన్ని అమల్లోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 14 వందల మంది భక్తులు రాజన్నను బ్రేక్‌దర్శనం ద్వారా దర్శించుకోగా దాదాపు రూ. 15 లక్షల ఆదాయం సమకూరిందని వివరించారు. రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించే నిజకోడెల ను ఇప్పటి వరకు రైతులకు 1500 కోడెలను అప్పగించామని తెలిపారు. కోడెల కోసం మూడు షెడ్లు నిర్మాణం చేపట్టామని, మరోకటి నూతనంగా నిర్మాణం జరుగుతుందని అన్నారు. కోడెలకు దాణ, పచ్చిగడ్డి అందజేస్తున్నామని తెలిపారు. భక్తులకు వసతి కల్పించేందుకు నిర్మించే గదులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఆలయాభివృద్ధికి రూ. 50 కోట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిందని పేర్కొన్నారు.

మోడల్ పాఠశాలలకు అరకొరగా ఆర్టీసీ బస్సులు

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి

వేములవాడ రూరల్, అగస్టు 28: మోడల్ పాఠశాలలకు అరకొరగా ఆర్టీసీ బస్సులు కేటాయించిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. వేములవాడలో బుధవారం నిర్వహించిన రూరల్ బీజేపీ సభ్యత్వ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మోడల్ పాఠశాలలకు సరిపడా బస్సులను ఆర్టీసీ కేటాయించకపోవడంతో విద్యార్థులు ఇంటికి చేరుకునే సరికి ఆలస్యమవుతోందన్నారు. దీంతో విద్యార్థులు అలసిపోయి వారు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారన్నారు. రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. మోడల్ పాఠశాలలకు బస్సులు కేటాయించాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే లు లేఖలు రాసినప్పటికీ మంత్రి చోద్యం చూస్తున్నారన్నారు. తనకు తాను విద్యార్థి నాయకుడిగా చెప్పుకునే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదర్శ పాఠశాలల పట్ల వ్యవహరించే తీరు బాధాకరమన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి మోడల్ పాఠశాలలకు తగిన బస్సులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, నాయకులు బూరుగుపల్లి పరమేశ్, మంద రాజేందర్, తోట రాజశేఖర్, రేండ్ల మహేష్, గోపు ప్రవీణ్, లింగంపల్లి కుంటయ్య, ముస్కం సంజీవ్, జంగం వంశి, గుడిసె రమేష్, పర్శరాం, ఆడెపు విజయ్, నరేష్, రాజు, శ్రీను, తిరుపతి, కిషోర్, కంజాకర్, వంశికృష్ణ, అశోక్, తిరుపతి, గంగాధర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగిరెడ్డి కృష్ణారెడ్డి

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- వీర్నపల్లి కేజీబీవీ పాఠశాల తనిఖీ

వీర్నపల్లి, ఆగస్టు 28: ప్రభుత్వ హాస్టళ్లలో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వంటగది, స్టోర్ రూం, టాయిలెట్స్, పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టడంతో పాటు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి వైద్య సేవలు అందజేసేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాలలోని అంశాలు విద్యార్థులను అడిగి వారి మేధాశక్తిని పరిశీలించారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థుల వసతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, జీఈసీవో పద్మజ, ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, పాఠశాల ప్రత్యేకాధికారి నీలిమా, ఆర్ఐ ప్రవీణ్ ఉన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కేశవపట్నం బస్టాండ్‌లో
ప్రయాణికురాలి పర్స్ చోరీ
దొంగకు దేహశుద్ధి చేసిన స్థానికులు

శంకరపట్నం, ఆగస్టు 28 : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బుధవారం ఓ మహిళ పర్సు దొంగలించిన వ్యక్తిని వెంటాడి పట్టుకొని బాధిత మహిళ, స్థానికులు దేహశుద్ధి చేశారు. వీణవంక మండలం ఘన్ముక్కుల గ్రామానికి చెందిన ఓ ప్రయాణికురాలు బస్ కొరకు బస్టాండ్‌లో వేచిచూస్తున్న సమయంలో ఓ వ్యక్తి పర్సు, ఫోన్‌ను దొంగలించాడు. అప్రమత్తమైన మహిళ దొంగను పట్టుకొని దేహశుద్ధి చేయగా గమనించిన స్థానికులు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగించే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

సెప్టెంబరు 1న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్
ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ , ఆగస్టు 28: కరీంనగర్ జిల్లా కోకో అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీన కరీంనగర్ ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. మానకొండూరు మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాల బాలికల విభాగాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు.

పోటీలలో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ పుట్టినతేదీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. క్రీడాకారుల ఇండెక్స్ బాల బాలికలకు ఎత్తు సెంటీమీటర్లలో, బరువు కిలోల్లో, వయస్సు సంవత్సరాలలో మొత్తం 215 పాయింట్లు దాటకుండా ఉండాలి. వయస్సు 3-10-2010 తేదీ తర్వాత జన్మించిన వారు. 14 వత్సరాలలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను సెప్టెంబర్ 13,14,15 తేదీలలో ఖమ్మంలో జరగనున్న 34వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని ఆయన తెలిపారు.

గడ్డి మందు కొట్టిన మేత తిని మేకలు మృతి

వేములవాడ రూరల్, అగస్టు 28: మండలంలోని బాలరాజుపల్లిలో గడ్డి మందు కొట్టిన మేత తిని మేకలు బుధవారం మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన పోచనేని ప్రమీల, సత్తయ్య రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం తమ మేకలను మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఓ రైతు పొలం వద్దకు చేరుకున్న మేకలు గడ్డి మందు కొట్టిన మేతను తినడంతో ఎనిమిది మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మేకలు మృతి చెందడంతో యజమానులు బోరున విలపించారు. తమకు 1,50,000 రూపాయల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు.

నకిలీ అల్లోపతి వైద్యశాలల్లో
అధికారుల తనిఖీలు



పెద్దపల్లిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 28: పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు సుల్తానాబాద్‌లోని పలు నకిలీ అల్లోపతి వైద్యశాలల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాల మేరకు సభ్యులు డాక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో టీజీఎంసీ తనిఖీ బృందం పెద్దపల్లి, సుల్తానాబాద్‌లలో నకిలీ అల్లోపతి వైద్యుల సెంటర్లపై బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లిలోని లోటస్ హాస్పిటల్, పురుషోత్తం, ఇమ్రాన్ బోన్ సెట్టింగ్స్ సెంటర్, వైఎస్ అజీజ్ క్లినిక్, సుల్తానాబాద్‌లోని నీలకంటేశ్వర్ మెడికల్ షాప్ మల్లేశం, మణికంఠ క్లీనిక్ చిన్న రమేష్ పేరుతో అర్హత లేకుండా పలు సెంటర్లు ఓపెన్‌చేసి వైద్యం చేస్తున్నారని వెలుగులోకి వచ్చిందని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ఈ తనిఖీల గురించి సమాచారం తెలుసుకుని నకిలీ వైద్యులు తమ క్లీనిక్‌లు, ల్యాబ్స్, పర్మిషన్‌లేని మెడికల్ షాపులను మూసి వేశారని పేర్కొన్నారు. అర్హత లేనివారు వైద్యులుగా చెలామణి అవుతూ యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు గుర్తించి తగిన ఆధారాలు సేకరించామని తెలిపారు. ఎన్ఎంసీ చట్టం ప్రకారం వీరిపై కేసు నమో దు చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో హెచ్ఆర్‌డీఏ సెక్రటరీలు డాక్టర్ శరణ్‌సాయి, సందీప్, భరత్ పాల్గొన్నారు.

● **అధికారులు వెళ్లిన తర్వాత..**

అల్లోపతి పేరిట అనుమతులు, అర్హతలు లేకున్నా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామని, క్లినిక్‌లు సీజ్ చేశామని ఓ వైపు అధికారులు ప్రకటించగా, వారు వెళ్లిన అనంతరం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న చిన్నరమేష్‌తో పాటు పలు క్లినిక్‌లు తెరిచి యథావిధిగా వైద్యం చేస్తూ కనిపించడం కొసమెరుపు.



నిర్మాణం పూర్తయినా..నిరుపయోగమే

ప్రారంభం కాని ఆసుపత్రి భవనం

మల్యాల, ఆగస్టు 28: మల్యాల ప్రాథమిక ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన నూతన ఆసుపత్రి భవనం నిరుపయోగంగా మారింది. అయిదేళ్ల క్రితం రూ.1.31కోట్లతో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు పూర్తికావడంతో గత శాసనసభ ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. 2018లో ప్రారంభమైన పనులు ఏడాది క్రితం పూర్తయ్యాయి. ఈ ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుండగా సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సిబ్బందితో నిర్వహించే సమావేశాలను చెట్ల కింద నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతన భవనంతో రోగులకు ఇక్కట్లు తొలిగిపోయే అవకాశం ఉండగా దాన్ని తెరవడం లేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పలువురు పేర్కొంటున్నారు

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	5,440	3,822	80.5	53.620
ఎల్లంపల్లి	2,892	9,902	20.175	17.220
మిడ్ మానేరు	10,500	21,000	27.54	17.48
ఎల్ఎండీ	14.802	232	24.034	9.517

రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి



కేడీసీసీ బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది

- ఉమ్మడి జిల్లాలో 59 వేల రైతులకు రూ. 444 కోట్లు రుణమాఫీ చేశాం
- యువతకు విదేశీ విద్యా రుణాలు ఇచ్చేందుకు కేంద్రంతో మాట్లాడతాం
- బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, ఆగస్టు 28: రాజకీయ పార్టీలకు అతీతంగా రాజకీయాలకు ఎలాంటి తావు లేకుండా సహకార సంఘాల్లో రైతుల హితం కోసమే మనమందరం పని చేయాలని బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 300 మెట్రిక్ టన్నుల గోదాం, ప్యాక్స్ ఆన్‌లైన్ సర్వీస్ డిజిటల్ సేవా కామన్ సర్వీస్ సెంటర్, ది కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ నూతన భవనాన్ని, ఏటీఎం సెంటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీ చేశామన్నారు. రైతు రుణమాఫీ కాకపోతే సహకార వ్యవస్థ ద్వారా ప్రభుత్వంతో సమ న్వయం చేసి రుణమాఫీ ఇప్పించాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 59 వేల మంది రైతులకు రూ. 444 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ లక్ష రూపాయల రుణమాఫీ చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచి పోయారన్నారు. సహకార సంఘాలకు విదేశి విద్య లోన్‌లు ఇచ్చే అర్హత లేదని అంటున్నట్లు తెలిసిందని, సహకార సంఘాల రైతుల పిల్లలు విదేశాల్లో చదువుకు నేందుకు లోన్‌లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని అన్నారు. గతంలో మహిళలకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని, ఇప్పుడు మహిళలకు రుణాలు ఇస్తున్నామన్నారు. మహిళలకు వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోవటానికి సహకరిస్తున్నామన్నారు. వేములవాడ లాంటి ప్రాంతాల్లో సహకార సంఘాలు రూ. 150 కోట్ల వ్యాపారం చేస్తున్నారని, రూ. 35 కోట్ల డిపాజిట్‌లు చేయడం అభినందనీయమని అన్నారు.

వైఎస్సార్‌తోనే సహకార సంఘాలకు నూతన వైభవం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలోనే సహకార సంఘాలకు నూతన వైభవం వచ్చిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేడీసీసీ బ్యాంకు నూతన భవనం ప్రారంభానికి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హజరైన ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు అన్ని వర్గాల వారికి వ్యక్తిగత రుణాలతో పాటు ఇతర దేశాల్లో చదువుకుంటున్న వారికి రుణాలు ఇచ్చే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. బ్యాంకు చైర్మన్‌లు అంకిత భావంతో పని చేయడం వల్లే సహకార బ్యాంకులు ఈ స్థాయిలో నిలుస్తున్నాయని అన్నారు. వాణిజ్య బ్యాంకులతో దీటుగా పోటీపడి సహకార బ్యాంకులు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, వైస్‌చైర్మన్ పింగలి రమేష్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్లు ఏనుగు తిరుపతిరెడ్డి, కిషన్‌రావు, స్వామి రెడ్డి, అల్వాల కోటి, మేనేజర్ గుంటి సాయికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, సీఈవో మిట్ల లక్ష్మణ్ కౌన్సిలర్లు, సంఘం చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

- ఏటా 50లక్షల అదనపు భారం!
- ఏజెన్సీల కైవసానికి పోటాపోటీ
- ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు
- టెండర్ ద్వారానే నియామకాలకు కమిషనర్ ఆదేశాలు

అంజన్నకు 'ఏజెన్సీ'ల గుదిబండ



మల్యాల, ఆగస్టు 28: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి ఔట్‌సోర్సింగ్ నియామకాల ఏజెన్సీలు గుదిబండగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీలతో దేవస్థానానికి అదనంగా పెద్ద మొత్తంలో భారం పడే అవకాశం ఉండడమే ఇందుకు కారణం. ఇటీవల ఏజెన్సీల కోసం అనేక మంది పోటా పోటీగా ప్రయత్నాలు చేపట్టడం చర్చనీయంశంగా మారింది. కొందరు ప్రజాప్రతినిధుల అండతో ఏజెన్సీలను కైవసం చేసుకోవడానికి కొన్ని నెలలుగా ప్రయత్నాలు చేస్తుండడంతో కొండగట్టులో ఔట్‌సోర్సింగ్‌లో నియామకాలపై అనేక మంది ఆశలు పెంచుకుంటున్నారు.

గతంలో టెండర్ ప్రక్రియ ద్వారా సిబ్బందిని నియమించుకోగా ఇప్పుడు ఏజెన్సీలతో నియమించడం, దేవస్థానం పరిధిలో ఏజెన్సీ దక్కించుకోవడానికి ప్రజాప్రతి నిధుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తూ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఏజెన్సీలతో గతంలో కన్న ఇప్పుడు లక్షల్లో అదనంగా దేవస్థానానికి భారం పడుతుందని పలువురు హిందూ సంస్థల ప్రతినిధులు అంటున్నారు. కొండపైన సెక్యూరిటీ సిబ్బందిని గతేడాది క్రితం వరకు టెండర్ ద్వారా నియమించుకునే వారు. ఇప్పటి ఏజెన్సీ ఖరారు కాకముందు ఒక్కో సిబ్బందికి దేవస్థానం తరపున రూ.6 వేల చొప్పున వేతనాలు అందించగా ప్రస్తుతం ఏజెన్సీ ద్వారా నియమించిన సిబ్బందికి ఒక్కోక్కరికి రూ.15 వేలు చెల్లిస్తున్నట్లు దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో ఏజెన్సీకి ముందు 11మంది విధులు నిర్వహించగా ఇప్పుడు అదనంగా 9 మందిని మొత్తం 20 మందిని ఏజెన్సీ ద్వారా నియమించారు. దాంతో గతంలో కన్నా ఇప్పుడు దేవస్థానానికి పెద్ద మొత్తంలో భారం పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తూ అదనపు భారానికి ఇది ఉదాహరణగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే గత జూన్ నెలతో ముగిసిన మరో ఏజెన్సీ స్థానంలో కొత్త ఏజెన్సీ కోసం కొందరు పోటీలు పడుతున్నట్లు తెలుస్తోంది. కనీస వేతనాలతో రోజు వారి భత్యంతో నియమించుకునే సిబ్బందిని ఏజెన్సీ ద్వారా నియమించుకోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల వరకు కొనసాగిన సిబ్బంది తమ విధులు కాకుండా ఆలయంతో విధుల కోసం రాజకీయ నాయకులతో సిఫారసులు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తాము చేయాల్సిన నిర్ధేశిత విధులు పక్కన పెట్టేశారని పలువురు విమర్శిస్తున్నారు. రెండు నెలలుగా ఏజెన్సీ సిబ్బంది లేకపోయినా ఎలాంటి ఇబ్బందులు లేవని అలాంటప్పుడు ఏజెన్సీ ద్వారా వచ్చే సిబ్బంది నియామకాలు అంతగా అవసరం ఉండదనే అభిప్రాయాలను ఆలయ వర్గాలతో పాటు పలువురు వ్యక్తం చేస్తున్నారు.

● టెండర్ ద్వారానే నియామకాలు

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆ పార్టీకి చెందిన కొందరు ఏజెన్సీ దక్కించుకోవడం, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రావడం పాత ఏజెన్సీ గడువు ముగియడంతో అధికార పార్టీ నేతలు ఏజెన్సీ కోసం జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అనేక మంది ఏజెన్సీల కోసం తమ చుట్టూ తిరుగుతుండడంతో ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఇటీవల దేవాదాయ కమిషనర్ ఏజెన్సీ కాకుండా టెండర్ ద్వారా నియామకాలు చేపట్టాలనే ఆదేశాలు ఇవ్వడంతో ఇక ఏజెన్సీ ఉండదని తమ ప్రయత్నాలకు గడి పడుతుందని తెలియడంతో కొందరు ఏజెన్సీ కోసమేప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నట్లు తెలుస్తుంది.

కమిషనర్ నిర్ణయం మేరకే
రామకృష్ణరావు, ఈవో



టెండర్ ద్వారా సిబ్బందిని నియమించాలని తమకు దేవాదాయ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం అయితే పలు ఆల యాల్లో చేపట్టిన నియామకాలను పరిశీలిస్తున్నాం. తదుపరి కమిషనర్ నిర్ణయం, ఉత్వర్వులు మేరకు తగు చర్యలు తీసుకుంటాం. గతంలో టెండర్ ద్వారా సిబ్బందికి వేతనాలు తక్కువే కాగ ఏజెన్సీలతో ప్రభుత్వం నిర్ధేశించిన కనీస వేతనాలు అందించాల్సి ఉంటుంది.

టెండర్ ద్వారానే నియామకాలు చేపట్టాలి
యాగండ్ల లక్ష్మినారాయణ, విశ్వహిందూ పరిషత్



అవుట్ సోర్సింగ్‌తో రాజకీయ నాయకులు తమ అనుచరులను నియమించు కోవడం, పైగా దేవస్థానంకు ఏజెన్సీలతో ఏటా అరకోటికి పైగా భారం వాటిల్లుతుంది. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఈ నియమాకాలతో దేవస్థానం నిధులను ఖర్చు చేయడం సరి కాదు. భక్తులకు సౌక ర్యాల కల్పనతో పాటు సిబ్బందిని నియమించుకోవాలి. మిగితా దేవాలయాల్లో మాదిరిగా ఇక్కడ టెండర్ పద్దతిలోనే నియమాకాలను చేపట్టాలి.

నార్కొటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీలు



నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 28 : మత్తు పదార్థాలను పసిగట్టడంతో ప్రత్యేక శిక్షణ పొందిన నార్కొటిక్ డాగ్‌తో కరీంనగర్ రెండో టౌన్ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. నగరంలోని ముకరంపుర, కశ్మీరగడ్డ, మంకమ్మతోట ప్రాంతాల్లోని అనుమానిత ప్రదేశాలు, పాన్ షాపులు, కిరాణంషాపులు, హోటళ్లలో నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. చాక్లెట్ రూపంలో కొందరు గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నార్కొటిక్ స్క్వాడ్ పోలీసులతో పాటు రెండో టౌన్ ఎస్ఐ చీనానాయక్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● కొనుగోలు చేసిన ముగ్గురు అదుపులోకి.. ● రెండు నాటు తుపాకులు, సామగ్రి స్వాధీనం ● ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: నాటుతుపాలకులు తయారుచేస్తున్న వ్యక్తితోపాటు కొనుగోలు చేసిన మరో ముగ్గురి అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం రాత్రి ఆయన వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ అనే వ్యక్తి నాటు తుపాకులు తయారుచేసి వాటిని అదే గ్రామానికి చెందిన అడవి జంతువులను వేటాడే వారికి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి సోదాలు చేయగా నాటుతుపాకీల తయారీకి సంబంధించిన సామగ్రి లభించిందన్నారు. శంకర్ వద్ద రెండు తుపాకీ బ్యారెల్, తుపాకులు తయారు చేయడానికి వాడే రంపం, సుత్తి, కత్తి, ఆకురాయి, డ్రిల్లింగ్ మిషన్, దూగోడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా నాటుతుపాకులు కొనుగోలుచేసిన గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు చంద్రమౌళి, శాతవేణి హరీష్, లోగిడి గంగయ్యలను అదుపులోకి తీసుకొని వారి వద్ద రెండు తుపాకులు, నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్(50), రాయలింగు చంద్రమౌళి(40), శత్రవేణి హరీష్(27), లోకిడి గంగయ్య(45)లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరి అరెస్ట్‌నకు చాకచక్యంగా వ్యవహరించిన ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజ్ కుమార్ (ఫైల్)

బీర్‌పూర్, ఆగస్టు 28: మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బేగె రాజ్‌కుమార్ (26) అనే యువకుడు మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం రాజ్‌కుమార్ నాలుగు నెలల క్రితం జగిత్యాల మండలం గుల్లపెటకు చెందిన రాజశ్రీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రాజశ్రీ అత్త బోగె కమల, ఆడపడుచు సమలత వరకట్నం కోసం రాజశ్రీతో పాటు రాజ్‌కుమార్‌ను కొద్ది రోజులుగా వేధిస్తూ వస్తున్నారు. దీంతో మనస్థాపానికి గురై ఈ నెల 26నా ఉదయం రాజ్ కుమార్ గడ్డి మందు తాగాడు. వెంటనే జగిత్యాలలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రాజశ్రీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుల అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 28: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ఈ నెల 23న అనుమతి లేకుండా డీజే నడపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారనే సమాచారం మేరకు ఏఎస్ఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని డీజేను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆరెపల్లి గ్రామానికి చెందిన బుర్ర సూర్యగౌడ్, బుర్ర స్వామిచరణ్, సిరికొండ గ్రామానికి చెందిన నీలం మహిపాల్, రేపాక గ్రామానికి చెందిన పోతుగంటి సంజయ్ పోలీసులను నెట్టివేశారు. ఏఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే పెట్టిన కేసన్నపల్లె గ్రామానికి చెందిన చిట్యాల హరీష్‌తో పాటు మిగతా నలుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ భూమిలో మట్టి తరలింపు

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



మట్టి తవ్వకాలను నిలిపివేస్తున్న అధికారులు

గంగాధర, ఆగస్టు 28: గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టితవ్వకాలను గ్రామస్థుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని వంటశాల గుట్ట వద్ద గతంలో ఉపాధి హామీలో ఈత,తాటి చెట్లతో పాటు పలు రకాల మొక్కలు నాటారు. ఈ మొక్కలను తొలగించి అక్రమంగా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్థులు అధికారులకు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన వైకుంఠధామంకు ప్రహరీ నిర్మించగా దాన్ని తొలగించి అక్రమంగా మట్టితవ్వకాలను చేస్తూ అమ్ముకుంటున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మొగిలి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: వేములవాడ మండలంలోని జయారం గ్రామానికి చెందిన డప్పుల వంశీ (23) అనే గంజాయి విక్రయదారుడిని బుధవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. వంశీ ఇంటర్ వరకు చదువుకొని గంజాయికి అలవాటుపడి హైద్రాబాద్‌లోని సినిమాటోగ్రఫీ కోర్సు చేసే సమయంలో జల్సాలకు పాల్పడ్డాడన్నారు. అనంతరం వేములవాడకు వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడన్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే తెలిసిన వ్యక్తుల దగ్గర గంజాయి కొని అందులో కొంత తాగి మిగిలిన గంజాయిని ఎక్కువ ధరలకు అమ్ముతూ డబ్బులు సంపాదించేవాడు. ఈ క్రమంలో ముస్తాబాద్‌లో గంజాయిని విక్రయిస్తుండగా సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి ముస్తాబాద్ వెళ్లారు. ఓ కల్యాణమండపం వద్ద అనుమానస్పదంగా కనిపించిన వంశీ వద్ద తనిఖీ చేయగా 100గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇందుకు ఉపయోగించిన స్కూటీ, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. అనంతరం వంశీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

రెండు బైకులు ఢీ

యువకులకు తీవ్ర గాయాలు

ఎండపల్లి, ఆగస్టు 28: మండలంలోని జగిత్యాల రాజారాంపల్లి ప్రధాన రహదారి ఎండపల్లి వైన్స్ చౌరస్తా వద్ద బుధవారం రెండు బైకులు ఢీ కొట్టడంతో యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎండపల్లికి చెందిన మంచికట్ల భీమయ్య, గుళ్లకోట గ్రామానికి చెందిన జనగిరి చిన్నయ్యగా వారిని గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు28: అక్రమంగా కబేలాలకు ఆవుల తరలింపు కొనసాగుతూనే ఉంది. మంగళవారం తెల్లవారుజామున ఎల్ఎండీ పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 48 ఆవులను పట్టుకొని ఎల్ఎండీలోని గోశాలకు తరలించగా అందులో ఊపిరి ఆడక అస్వస్థతకు గురై ఆరు మృతిచెందాయి. ఈ ఘటన మరువకముందే బుధవారం మరికొన్ని ఆవులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తిమ్మాపూర్ సిఐ కె. స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం నుంచి హైదారాబాద్ వైపునకు ఆవులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో బుధవారం కంటెయినర్‌లో 24 ఎద్దులు, 4ఆవులు తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆవులను తరలిస్తున్న వాహనం తప్పించుకునే ప్రయత్నంలో సిద్దిపేట జిల్లా గౌరారం పోలీస్‌స్టేషన్ సమీపం వరకు వెళ్లగా, పోలీసులు వారిని వెంబడించి పశువులను తరలిస్తున్న లారీని పట్టుకొని ఎల్ఎండి కాలనీలో గల గోశాలకు తరలించారు. పట్టుకున్న లారీలో 24 ఎద్దులు, 4ఆవులు మొత్తం 28 పశువులు ఉన్నాయి. రెండు రోజులలో మొత్తం 76 పశువులు పట్టుకున్నారు. ఇప్పటి వరకు 10పశువుల వరకు మృతి చెందాయి. పశువులను తరలిస్తున్న ఓనర్ సద్దం, లారీ డ్రైవర్ ఆసిఫ్, లేబర్లు సమీర్, తాహిద్‌లపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ స్వామి తెలిపారు.



మృతి చెందిన ఆవులు

కుటుంబ కలహాలతో దినసరి కూలీ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 28: మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామంలో కుటుంబ కలహాలతో గుంజ గంగాధర్(30) అనే దినసరి కూలీ బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో గుంజ గంగాధర్ కొంత కాలంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. కూలీ పనులు లభించక మద్యానికి బానిసయ్యాడు. కొంత కాలంగా ఇంటిలో భార్యాభర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి. పనులు చేయకపోతే కుటుంబ పోషణ గడవడం కష్టంగా మారుతోందని భర్త గంగాధర్‌ను భార్య స్వప్న మందలించింది. దాంతో మనస్తాపం చెందిన గంగాధర్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కొడుకులు శరత్, వరుణ్‌తేజ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

- రవాణా శాఖ మంత్రికి జర్నలిస్టుల వినతిపత్రం

వేములవాడ, ఆగస్టు 28: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులు అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దాసరి దేవేందర్ తదితరులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యుడు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం నాడు వేములవాడలోని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే తరఫున జర్నలిస్టులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడేటెడ్ జర్నలిస్టులు అందరికీ ఆర్టీసీ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి 10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మహేష్, వ్యవస్థాపకులు రేగుల దేవేందర్, మాజీ అధ్యక్షుడు హింగే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, సంయుక్త కార్యదర్శి సంపత్, కోశాధికారి నరేష్, సభ్యులు తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై నేటి నుంచి రైతు కుటుంబాల సర్వే

చందుర్తి ఆగస్టు 28: రేషన్ కార్డులో పేరులేకపోవడంతో రుణమాఫీ వర్తించని రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వేను నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు రుణమాఫీ పథకం 2024 రేషన్ కార్డులో పేరులేకపోవడంతో రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ కోసం గ్రామాల్లో ఈనెల 29నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు పర్యటిస్తారన్నారు. రైతులు అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని కోరారు. ఈనెల 29న చందుర్తి, రామన్నపేట, మరిగడ్డ, 30న అసిరెడ్డిపల్లి, తిమ్మాపూర్, అనంతపల్లి, 31న మల్యాల, లింగంపేట, కట్ట లింగంపేట, సెప్టెంబరు 2న జోగాపూర్, కిష్టంపేట, రామారావుపల్లి, సనుగుల, దేవునితండా, 3న బండపల్లి ఎనగల్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటిస్తారని తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న ఆలయ ఆవరణలో భక్తుల సందడి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 28: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్‌లో నిరీక్షించడంతో దర్శనం కోసం వచ్చిన వరంగల్‌కు చెందిన ఓ మహిళ స్పృహ కోల్పోగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

● నేడు స్వామి వారికి లక్ష బిల్వార్చన..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి గురువారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో గురువారం రోజున అభిషేక పూజలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ నాయకులను చూస్తే బాధేస్తుంది

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 28: లిక్కర్ స్కాంలో జైల్లో ఉండి బెయిల్‌పై విడుదలైన కల్వకుంట్ల కవితపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఉత్సాహన్ని చూస్తే బాధేస్తుందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడిగిన ముత్యంలా కవిత జైలు నుంచి బయటకు వచ్చారని బీఆర్ఎస్ నాయకులు స్పందిస్తున్న తీరు హాస్యాస్పదమన్నారు. లిక్కర్ స్కాంలో సీబీఐ, ఈడీ పెట్టిన కేసులో కవిత తీహార్ జైలులో ఉండి న్యాయ ప్రక్రియలో భాగంగా బెయిల్‌పై విడుదల అయ్యారన్నారు. ప్రజా సమస్యలపై ఒక్కసారి కూడా ఢిల్లీకి వెళ్లని కేటీఆర్, హరీ‌ష్‌రావులు ఇటీవల వరుసగా ఢిల్లీకి వెళ్లడం కవితను రక్షించుకోవడం కోసమేనని అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్‌మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, వెల్ముల స్వరూపరెడ్డి, కల్లూరి చందన, ఆకునూరి బాలరాజు, నేరేళ్ల శ్రీకాంత్‌గౌడ్, వైద్య శివప్రసాద్, మంగకిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి: డీఈవో

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 28: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతిలో గత సంవత్సరం 10 జీపీఏలను సాధించిన విద్యార్థులకు కౌన్సిలర్ కల్లూరి రాజుతోపాటు మండల విద్యాధికారి దూస రఘుపతి తన తండ్రి దూస లక్ష్మీనర్సయ్య జ్ఞాపకార్థం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులకు డీఈవో రమేష్‌కుమార్ అందజేశారు. అలాగే మధుసూదన్ అనే ఎన్ఆర్ఐ 10 జీపీఏ సాధించిన గాజుల అక్షయకు రెండు వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుపతి, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● టీఎల్ఎం కిట్ల పంపిణీ

సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌లోని మండల విద్యావనరుల కేంద్రంలో భవిత కేంద్రంలో ఉన్న మేధో దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ మేధో దివ్యాంగ వ్యక్తుల సాధికారిత సంస్థ అందించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) కిట్లను జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ దివ్యాంగ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల మేధో అభివృద్ధికి, అకాడమిక్ అంశాల వృద్ధికి టీఎల్ఎం కిట్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఐడీ సంస్థ కో- ఆర్డినేటర్ లక్ష్మణ్‌బాబు, జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ సతీష్‌కుమార్, మండల విద్యాధికారి దూస రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయండి

వీర్నపల్లి, ఆగస్టు 28: మహిళలు, విద్యార్థినిలు లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలని సఖి కేంద్రం కౌన్సెలింగ్ సిబ్బంది పద్మ, సుమలత కోరారు. వీర్నపల్లి మండలంలోని జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలల్లో మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు నివారణకు సఖి కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక, కేజీబీవీ ఎస్‌వో నీలిమా పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల లైంగిక వేధింపులపై ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల, కేరళ హైస్కూల్‌లో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు ఆపద వేళల్లో 100, 1098కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

కోనరావుపేట, ఆగస్టు 28 : మండలంలోని ధర్మారం, కొలనూరు, మర్తనపేట, నాగారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఐ శేఖర్ పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోక్సో చట్టంలో ఉండే శిక్షలు, జరిమానాలు, మైనర్ పిల్లలపై జరిగే అఘాయిత్యాలపై వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమ్మ, రమ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల, పొత్తూరులోని వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పాఠశాల నిర్వాహకులు మధూకర్‌రెడ్డి, పండరీనాథ్, శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ భాష... మమతల మూట

- అక్షరమై ఎదిగింది..

మనసులను హత్తుకుపోయింది

- నేడు మాతృభాషా దినోత్సవం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అమ్మ ఒడిలోని వెచ్చదనంగా అక్షరమై ఎదిగిన తెలుగు భాష మనసులను హత్తుకుపోయింది. ఓనమాలతో మనిషి అవసరమై శోభిల్లుతోంది. తెలుగుభాష తియ్యదనం తల్లి ప్రేమలాగ కమ్మగా ఉంటుంది. పద ఉచ్ఛరణ ఎంత గంభీరమో, అంత సుకుమారంగా ఉంటుంది. సుతి మెత్తని మందలింపులకు ఆత్మీయ అనురాగంతో బుద్ధిమాటలు చెప్పడానికి వారధిగా ఉంటుంది. కొంత మంది విదేశీ ఉద్యోగాలు సంపాదించుకోవడం కోసం లక్షలాది మందిగా ఉన్న వారిపై ఇంగ్లీష్ బోధన భాషను రుద్దడం ఎంత వరకు సరైందో ఆలోచించాల్సిన అవసరం కూడా ఉంది. మన దేశంలో అనేక భాషలు, మతాలు, సాంప్రదాయాలు ఉన్నాయి. ఈ వైవిధ్యంలోనే ఏకత్వం సాధించాల్సి ఉంటుంది. భారతీయ భాషలన్నింటికి చరిత్ర ఉంది. సంపన్నమైన సాహిత్యం ఉంది. అవి పోషించిన సంస్కృతులు ఉన్నాయి.

● సుసంపన్నమైన చరిత్ర..

ఒక పెద్ద డబ్బాలో గులకరాళ్ల వేసి డబడబా వాయిస్తే వచ్చే శబ్దం తమిళంలా.. చిన్న డబ్బాలో నుంచి వచ్చే శబ్దం మళయాలంలా.. ఆ రెండు డబ్బాల నుంచి వచ్చే ధ్వని కన్నడంలా ఉంటుందని ప్రముఖ కవి ద్రావిడ భాషలను పోలుస్తూ.. చమత్కరిస్తూ తెలుగు అక్షరాలు పదాల్లో ఉన్న మాధుర్యం ఏ ఇతర భాషల్లోను ఉండదని పేర్కొన్నారు. అలాంటి తెలుగు భాషకు సుసంపన్నమైన చరిత్ర ఉంది. తెలుగుభాషకు 2500 చరిత్ర సంపన్నమైన సాహిత్యం ఉంది. 1968లోనే భారతీయ అధికార భాషా చట్టం సవరణను బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. భాషా విధానానికి ఒక తీర్మానం కూడా చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు చేసేటప్పుడు ఇంగ్లీష్ లేక హిందీ భాషాజ్ఞానం నిర్ధేశింపబడాలని పేర్కొంది. కేంద్ర ఉద్యోగాల నియామకాల పరీక్షల్లో భారతీయ భాషలన్నింటిని ప్రవేశ పెట్టాలని తగు మార్గాలు సూచించాలని డాక్టర్ డీఎస్ కోఠారి అధ్యక్షతన కమిటీ సిఫార్సు చేసింది. కానీ రాష్ట్రంలో తెలుగు భాషను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఉన్న నిబంధనలు పాటించడం లేదు.

● తెలుగు భాషకు ప్రాచీన హోదా..

ఎందరో తెలుగు భాషావేత్తల కృషితో 2008 అక్టోబరులో తెలుగుకు ప్రాచీన హోదా ఏర్పడింది. గిడుగు రాంమూర్తి పంతులు సవర జాతి వారి కోసం పాఠశాలలు పెట్టించాలని ప్రయత్నించారు. భాషా నిఘంటువు, భాషా వ్యాకరణం, వాడుక భాషా ఉద్యమాన్ని నడిపి గిడుగు పిడుగులా పేరుతెచ్చుకున్నాడు. గిడుగు రాంమూర్తి జన్మదినమైన ఆగస్టు 29న మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

● వికసించిన భాషా కుసుమం..



పెద్దింటి అశోక్‌కుమార్

చందుర్తి: ఇంగ్లీష్ మోజులో ప్రాధాన్యం తగ్గుతున్న ఈ రోజుల్లో కొందరు భాషాభిమానులు మాతృ భాషను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. వృత్తులు వేరైనా తెలుగు భాషాభివృద్ధే ప్రవృత్తిగా విశేష కృషి చేస్తున్నారు. చందుర్తి మండలంలోని కిష్టంపేటలో గణితం ఉపాధ్యాయు డిగా కొనసాగుతున్న పెద్దింటి అశోక్‌కుమార్ తెలుగు సాహిత్యంపై తనదైన ముద్ర వేసుకున్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గణితం ఉపాధ్యాయుడు తెలుగు భాషా అభివృద్ధికి చేస్తున్న సేవలను పలువురు ఉపాధ్యాయులు, కవులు కొనియాడుతు న్నారు. అశోక్‌కుమార్ తెలంగాణ సినిమాలకు మాటలు పాటలు రాస్తున్నారు. ఉస్మానియా, కాకతీయ, మద్రాస్ యునివర్సిటిలలో ఆయన రచనలు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. ఆయన సాహిత్యంపై ఇప్పటివరకు వివిధ యూనివర్సిటీలలో ఐదు ఎంఫిల్‌లు, నాలుగు పీహెచ్‌డీలు వచ్చాయి. ఆయన రాసిన జిగిరి నవల పదకొండు భాషల్లోకి అనువాద మైంది. కన్నడ, హిందీ భాషల్లోకి కథలు అనువాదమై సంకలనాలుగా వచ్చాయి. ఇంతవరకు 250 కథలు 10 కథా సంకలనాలు ఎనిమిది నవ లలు ఐదు నాటకాలు 100 వరకు వ్యాసాలు రాసి 12 సినిమాలకి రచనలు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులకు చెదలు

- బాధ్యతలు చేపట్టేందుకు ముందుకు రాని అధికారులు



కార్యాలయంలో కిటికీ పక్కన ఉన్న రికార్డులు

వేములవాడ, ఆగస్టు 28: కొద్ది నెలలుగా అవినీతి ఆరోపణలు, రకరకాల వివాదాలకు కేంద్రంగా మారిన వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పలు రికార్డులకు చెదలు పట్టినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇంతకుముందు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అధికారి నెల రోజుల కింద బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్తగా నియమితులైన అధికారి బాధ్యతలు స్వీకరించిన వెంటనే కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సక్రమంగా లేకపోవడంతో వెంటనే వ్యక్తిగత కారణాలపై సెలవుపై వెళ్లిపోయారు. కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, కొన్ని రికార్డులకు చెదలు పట్టినట్లు గుర్తించిన కారణంగానే ఆయన వ్యక్తిగత కారణాలు చెబుతూ సెలవుపై వెళ్ళిపోయి ఇంతవరకు విధులకు హాజరు కాలేదని తెలుస్తోంది. ఫలితంగా నెల రోజులుగా వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ దాదాపుగా నిలిచిపోయింది. వేములవాడలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 1982వ సంవత్సరంలో ప్రారంభించగా, సుమారు 18 సంవత్సరాల పాటు మ్యాన్యువల్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు. 2000 సంవత్సరం నుంచి కంప్యూటర్ సేవలు అందుబాటులోకి రావడంతో రిజిస్ట్రేషన్ దస్తావేజులను స్కానింగ్ చేస్తూ డిజిటల్ రూపంలో భద్రపరుస్తున్నారు. 1982 నుంచి 2000 మధ్యకాలంలోని రిజిస్ట్రేషన్ దస్తావేజులు స్థానిక రికార్డు గదిలో భద్రపరచగా వాటి నిర్వహణపై తగిన శ్రద్ధ చూపించకపోవడంతో రికార్డులకు చెదలు పట్టినట్లు గుర్తించారు. ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టిన అధికారి చెదలు పట్టి ఉన్న రికార్డులను గమనించిన కారణంగానే ఇక్కడ విధులు నిర్వహించడానికి సుముఖంగా లేనట్లు తెలుస్తోంది.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ చేసిన డీఐజీ..

వేములవాడలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కరీంనగర్ డీఐజీ రవీందర్ బుధవారం నాడు తనిఖీ చేశారు. ఇన్‌చార్జి అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను, ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన దస్తావేజులను ఆయన ఈ సందర్భంగా తనిఖీ చేశారు. భూములు ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన స్థానిక అధికారులకు తగిన సూచనలు చేశారు. వేములవాడ కార్యాలయానికి పూర్తిస్థాయి సబ్‌రిజిస్ట్రార్‌ను మరో మూడు వారాల్లో నియమిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. దస్తావేజులకు సంబంధించిన రికార్డులకు చెదలు పట్టిన విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌ల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా పనిచేయాలని అధికారులకు, సిబ్బందికి డీఐజీ రవీందర్ సూచించారు.

విద్యార్థుల ఇబ్బందులపై సత్వర చర్యలు

వీర్నపల్లి, ఆగస్టు 28 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తితే సత్వర చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకునేందుకు వస్తున్న విద్యార్థులకు గేటు తీసేందుకు ఇబ్బందులు కలగడంతో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వెంటనే చర్యలను చేపట్టారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, వైస్ చైర్మన్ రాజం, కార్యదర్శి నారాయణ, మాజీ ఉపసర్పంచ్ బోయిని రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా అఫ్జల్‌బేగం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 28: మండల ప్రత్యేక అధికారిగా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్న డీపీవో భాస్కర్ బదిలీ వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా బదిలీపై వచ్చిన అఫ్జల్‌బేగం మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఎంపీడీవో సత్తయ్య, అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాజన్న అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 28: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు భక్తుడు ఐదు లక్షల రూపాయల విరాళం అందజేశాడు. హన్మకొండ జిల్లా నర్సక్కపల్లి గ్రామానికి చెందిన ఈగ రమేష్ అనే భక్తుడు బుధవారం రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి ఐదు లక్షల రూపాయల విలువపై చెక్కును అందజేశారు. వారి వెంట పర్యవేక్షకులు వెల్ది సంతోష్, ఉద్యోగులు భీమేశ్వర, కుమార్ ఉన్నారు.

'మిడ్ మానేరు'కు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి/ఇల్లంతకుంట ఆగస్టు 28: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 9450, మూలవాగు, మానేరు వాగు ద్వారా 1050 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్ఎండీ ప్రాజెక్టుకు అయిదు గేట్ల ద్వారా 14,600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.48 టీఎంసీల మేరకు ఉంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో రిజర్వాయర్‌లో పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కోనరావుపేట, ఆగస్టు 28: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి వై శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి అధ్యాపకుల బోధన పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్కూల్ రికార్డులు పరిశీలించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాదారేశ్వర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

- బోయినపల్లి పోలీస్ స్టేషన్ అకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

బోయినపల్లి, ఆగస్టు 28: గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులకు సూచించారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డులు, వర్టికల్స్ అమలు తీరు, స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అధికారులు, సిబ్బందికి అంకితభావంతో విధులను నిర్వర్తించాలన్నారు. నేరాల నియంత్రణ కోసం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, గ్రామాల్లో తరచూ పర్యటించాలన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నేరస్థులు, అనుమానితులు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై ,అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలని సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పృథ్వీందర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

● ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించాలి

వేములవాడ రూరల్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను , రికార్డులను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఏఎస్పీ శేశాద్రిని రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతీ ఉన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వంరూ రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండానే అమలు చేసి రైతులందరిని ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం అంజన్న డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం సీపీఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ అధ్వర్యంలో నాయకులు ధర్నా చేసి కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇప్పటివరకు 53 శాతం మంది రైతులకు లబ్ధి జరిగిందన్నారు. మిగిలిన రైతులందరికీ రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సోమనాగరాజు, సోమ రవి, పంతం రవి, అజ్జ వేణు, కడారి రాములు, కోరం క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి..

సిరిసిల్ల కలెక్టరేట్: మున్సిపాల్టీలల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వాటిని పరిష్కారించి వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం ఏఐటీయూసీ జిల్లా కమిటీ అధ్వర్యంలో సిరిసిల్ల , వేములవాడ మున్సిపాల్టీలలో పనిచేసే కార్మికులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులుగా సంవత్సరాలుగా పనిచేస్తున్నా వారిని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అజ్జవేణు, కుమ్మరి లక్ష్మణ్, బండి ప్రాద్, అద్దంకి భూమేష్, బండ లక్ష్మీ రాజం, బొజ్జే వినోద్, సుందరగిరి శ్రీనివాస్, నర్సింగోజు మారుతి పాల్గొన్నారు.

మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సిరిసిల్ల రూరల్, అగస్టు 28: పట్టణంలోని పాత మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన మైసమ్మ అలయంలో బుధవారం వేదమంత్రోచ్ఛరణ మధ్య వేద బ్రహ్మణులు కన్నుల పండువగా మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పట్టణంలోని పాతమర్కెట్‌లో వేంకటేశ్వర కూరగాయల మార్కెట్ సంఘం అధ్వర్యంలో మైసమ్మతల్లి గుడిని పునర్ నిర్మాణాలను చేపట్టగా మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠను వేద పండితుడు గోసికొండ హన్మంతు పంతులు అధ్వర్యంలో మహాయజ్ఞాన్ని చేపట్టి ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠమహోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణితోపాటు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ పూజలు చేశారు.



పూజలు చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

విద్యుత్ పోరాట అమరవీరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 28: పట్టణంలోని బీవైనగర్ లోగల క్రామేడ్ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో బుధవారం సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలు గుదేశం పార్టీ ప్రపంచ బ్యాంకు నిబంధనలకు తలోగ్గి విద్యుత్ ప్రైవేటికరణకు పూనుకున్నార న్నారు. నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వ ర్యంలో ఇతర వామపక్ష మరియు ఇతర పార్టీల సహకారంతో విద్యుత్ పోరాటం చేశామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ బషీర్‌బాగ్ చౌరస్తాలో పోలీసులు జరిపిన కాల్పుల్లో అమరులైన వారి త్యాగాల ఫలితంగానే గతంలో, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకవచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని సవరిం చడంతోపాటు రాష్ట్రంలో గృహజ్యోతి పథకాన్ని అందరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లార పు అరుణ్ కుమార్, కోడం రమణ, జవ్వాజి విమల, ముక్తి కాంత అశోక్, ఎరవెల్లి నాగరాజు, గురజాల శ్రీధర్, సూరం పద్మ, మల్లారపు ప్ర శాంత్, వివిధ ప్రజాసంఘాల నాయకులు అన్న ల్దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, మంద అనిల్, శ్రీరాముల రమేష్‌చంద్ర, నక్క దేవదాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

తంగళ్లపల్లి: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. బుధవారం తంగళ్లపల్లి మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలతో పాటు కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్‌లలో పీఆర్‌టీయూఎస్ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

ముస్తాబాద్: ఈడీ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ మాట్లాడుతూ.. కెసిఆర్ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో బిజెపి ఈ కుట్ర చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, మాజీ సర్పంచ్ తాడేపు ఎల్లం పాల్గొన్నారు.

రుద్రంగి: రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారని, రుద్రంగిలో 3వేల మంది రుణాలు తీసుకుంటే 1800 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో జాకి అనే పెంపుడు శునకం మృతి చెందడంతో పోలీస్ సిబ్బంది బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో కొద్ది సంవత్సరాలుగా పెరిగిన శునకం అనారోగ్యానికి గురై మృతి చెందడంతో పోలీస్ సిబ్బంది పూలతో నివాళులర్పించి, శునకానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాబు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మారు లక్ష్మారెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు.

ఇల్లంతకుంట: మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అన్నపూర్ణ కళ్యాణ మండపంలో గురువారం ఉంటుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.